సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 30 । జూలై । 2025



సోమశిలలో.. అక్రమ వేట!

సోమశిల జలాశయం బ్యాక్ వాటర్‌లో గుడ్డు దశలో ఉన్న చేపల సంపదపై అక్రమ వేట కొనసాగుతోంది. ఇది చేపల వృద్ధికి అడ్డంకిగా మారింది. -8లో



నామినేషన్లకు ముందే బెదిరింపులు

ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున నామినేషన్ వేసిన వారిని తుదముట్టిస్తామంటూ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.450	రూ.560
రెండోరకం	రూ.320	రూ.440

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 298 మెట్రిక్ టన్నులు



కమ్ముకున్న కరువు మేఘాలు

జిల్లాలో దుర్భిక్ష పరిస్థితులు

- ఎండిపోయిన బోరు బావులు, చెరువులు, కుంటలు
- వర్షం లేక ముందుకు సాగని వ్యవసాయ పనులు
- అరకొరకగా సాగైనా.. వాడిపోతున్న పంట
- ఆదుకునే దిశగా అడుగులు వేయని ప్రభుత్వం



శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో అడుగంటుతున్న నీటిమట్టం

సాక్షి రాయచోటి: ఖరీఫ్ ప్రారంభం నుంచే కష్టకాలం వెంటాడుతోంది. సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా.. నీటి చుక్క చూడలేదు. కరువుమేఘం కమ్ముకోగా.. రైతుల మోముల్లో ఆందోళన నెలకొంది. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన ఖరీఫ్.. కరువు బారిన పడుతోంది. అదునులో పదును వర్షం పడి ఉంటే.. వేరుశనగతోపాటు ఇతర పంటలతో పచ్చగా ఉండాల్సిన జిల్లా.. కళావిహీనంగా మారుతోంది. జూన్, జూలై మాసాల్లో వర్షపాతం లోటుతో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తుండగా.. మరోపక్క ఏడాది కాలంగా వర్షాలు లేక బోరుబావులు మొదలుకొని చెరువులు, కుంటలు సైతం ఎండిపోయాయి. కష్టాల్లో ఉన్న కర్షకుడిని ఆదుకునే దిశగా కూటమి సర్కార్ చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీరు లేక.. వాడుతున్న పంటలు

అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు లక్ష ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా. అయితే మే, జూన్ తొలినాళ్లలో పడిన అరకొర వర్షాలకు కొందరు విత్తనం వేశారు. అయితే ప్రస్తుతం రెండు నెలలుగా వర్షాలు లేకపోవడంతో.. వేసిన పంటలు కూడా వాడుముఖం పట్టాయి. కొన్నిచోట్ల జొన్నతోపాటు ఇతర పంటలు నీటి ఎద్దడికి తట్టుకోలేక ఎండిపోతున్నాయి. బోరు బావులు ఉన్న రైతులు వర్షం వచ్చేంత వరకు రక్షించుకునేందుకు చిన్న చిన్న తుడుల ద్వారా అగచాట్లు పడుతుండగా.. వర్షాధారం కింద సాగు చేసిన పంటలు ఎండుపోయే దశకు చేరుకుంటున్నాయి.

పదును వర్షం కోసం ఎదురుచూసినా..

జిల్లాలో అధిక మంది అన్నదాతలు ఖరీఫ్‌లో సాగు కోసం ఎదురు చూస్తూనే ఉండిపోయారు. అదునులో పదును వర్షం కురవకపోవడంతో విత్తనం వేయలేని పరిస్థితి నెలకొంది. వేరుశనగ కాయలు కూడా కొనుగోలు చేసి విత్తనం వేసేందుకు సిద్ధమైనా.. రెండు నెలల నుంచి పదును జాడలేదు. జూలై 15లోపు మోస్తరు వర్షం వచ్చి ఉంటే వేరుశనగకు అదునుగా భావిస్తారు. కానీ పదును వర్షం జాడలేకపోవడంతో పంట వేసుకోలేని పరిస్థితి నెలకొంది. వేరుశనగ విత్తనాలను భూమిలో వేయలేక, ఇటు తక్కువ రేట్లకు అమ్ముకోలేక అన్నదాతలు పడుతున్న ఆక్రందన అంతా ఇంతా కాదు.

- ఆగస్టులో వర్షాలు పడినా కేవలం ప్రత్యామ్నాయ పంటలకు మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది. గత ఏడాది కూడా ఇలాంటి విపత్కర పరిస్థితిని ఎదుర్కొన్నారు. మరోమారు ఇలాంటి పరిస్థితే ఎదురుకావడం ఆందోళన కలిగించే పరిణామం.



వాడిపోతున్న జొన్న పంట

అన్నదాతకు అందని సాయం



వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో ప్రతి ఏడాది మే నెలలోనే వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద నిధులు విడుదల చేసేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు జమ చేస్తామంటున్నా.. అనేక సాకుల చట్రంలో ఎంత మందికి సాయం అందుతుందన్నది కూడా అర్థం కావడం లేదు. ఒకపక్క ఇప్పటికే ఉన్న పంటలను ఎండిపోతుండగా.. వర్షం లేక కొత్త పంటలు వేయడానికి మార్గం లేక రెండు విధాలా ప్రకృతి వలయంలో చిక్కి అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు రైతులు గుర్తు చేస్తున్నారు.

కర్షకులను ఆదుకోవాలి



జిల్లాలో ఖరీఫ్ పంటలు వేయలేక కొంతమంది అల్లాడిపోతుంటే, మరికొంతమంది రైతులు పంటలు వేసి దెబ్బతిన్నారు. వ్యవసాయశాఖ ద్వారా అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలి. ప్రభుత్వం పెట్టుబడి సాయంతోపాటు పరిహారం అందించాలి.

– యండపల్లి బాలకృష్ణారెడ్డి, జిల్లా కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్

అడుగంటుతున్న భూగర్భ జలాలు



సంబేపల్లె మండలంలో జగనన్న కాలనీ సమీపంలో నీరు లేక ఎండిపోయిన చెరువు

జిల్లాలో ఎక్కడ చూసినా చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఎండిపోయాయి. ప్రాజెక్టుల్లో సైతం నీటిమట్టం తగ్గిపోతోంది. వర్షాకాలమే అయినా భారీ వర్షాలు నమోదు కావడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కరువు ఛాయలు అలుముకుంటున్నాయి. బావులు, బోర్లలో సైతం భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. జిల్లా రైతాంగం కరువు పరిస్థితులలో ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు.



నీరు లేక బోసిపోయిన కెనాల్

గ్రేడింగ్ చేస్తే మంచి ధర



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

పులివెందుల రూరల్: రైతులు చీనీ కాయలను గ్రేడింగ్ చేసుకుని మార్కెట్ తీసుకొస్తే మంచి ధరలు లభిస్తాయని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని చీనీ కాయల మార్కెట్‌లో వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు చీని కాయలను మార్కెట్ తీసుకొచ్చే సమయంలో సైజులు వారీగా చీనీ కాయలను గ్రేడింగ్ చేసుకుని తీసుకురావాలన్నారు. ఈ విషయాన్ని రైతులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించామన్నారు. రైతులు సరుకు అమ్మిన తర్వాత తప్పనిసరిగా పట్టి పొందాలన్నారు. చీనీ కాయలను కోసేందుకు, రవాణా చేసేందుకు కూలీల కొరత ఉందని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి అజాద్‌వలి, మార్కెట్ కమిటీ సిబ్బంది, వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లు సజీవ దహనం



మృతి చెందిన ఆఫ్రీన్



ఫాతిమా మృతదేహం

- మంటల్లో కాలి ఇద్దరు మృతి
- అంతుచిక్కని కారణాలు

రాయచోటి: పేద కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు సజీవ దహనమైన సంఘటన రాయచోటిలో మంగళవారం సాయంత్రం సంచలనంగా మారింది. పట్టణంలోని పూజారి బండ వీధిలో చోటు చేసుకున్న సంఘటనలో.. అక్క షేక్ బీబీ ఫాతిమ (27), షేక్ ఆఫ్రిన్ (25) మంటల్లో కాలిపోయి మృత్యువాత పడ్డారు. అయితే కారణాలు అంతుకు చిక్కడం లేదు. వివరాలిలా ఉన్నాయి. పూజారి బండకు చెందిన షేక్ హుస్సేన్, మాబ్ జాన్‌లకు షేక్ బీబీ ఫాతిమా, షేక్ ఆఫ్రిన్‌లు సంతానం. వీరిద్దరూ ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నారు. తరువాత ఇంటి వద్దనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. హుస్సేన్ భార్య మాబ్‌జాన్‌తో కలిసి ఇంటి సరుకుల కోసం మంగళవారం సాయంత్రం బజారుకు వెళ్లిన సమయంలో.. ఇంటిలో బాలికలు ఇద్దరే ఉన్నారు. ఆ సమయంలోనే గడియ పెట్టుకొని అక్కాచెల్లెళ్లు శరీరాలపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకున్నట్లు స్థానికుల సమాచారం. మంటల్లో కాలుతుండగా చుట్టుపక్కల వారు గమనించి.. తలుపులు పగులకొట్టి వారిద్దరినీ ఆసుపత్రికి చేర్చారు. అప్పటికే శరీరమంతా తీవ్రంగా కాలిపోయిన ఫాతిమా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆఫ్రీన్ తీవ్ర గాయాలతో విషమ పరిస్థితిలో ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది.

ఇంటిలో ఎవరూ లేని సమయంలో..

ఇంటిలో ఎవరూ లేని సమయంలో చోటుచేసుకున్న సంఘటనపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పేద కుటుంబానికి చెందిన బాలికలు ఇద్దరూ మంటల్లో కాలిపోవడం చుట్టుపక్కల వారిని కలచివేసింది. ఇంటిలో గ్యాస్ లేదని, కట్టెల పొయ్యితోనే వంట చేసుకునే వారని స్థానికులు చెబుతున్నారు. వంట చేసేటప్పుడు ప్రమాదవశాత్తు కిరోసిన్ క్యాను అంటుకొని కాలిందా లేక వారంతట వారు కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నారా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ చలపతి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టాలెక్కని వారణాసి రైలు

సప్త మహాక్షేత్రాల్లో ప్రాధాన్యమైనది వారణాసి. వరుణ, అఖి నదుల కలియక ఫలితంగా విష్ణుమూర్తి, నారాయణునికి తొలి ఆలయంగా ఏర్పడిన పవిత్ర స్థలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒక్కచోట ఉన్న క్షేత్రం. అన్నపూర్ణదేవి కొలువైన ప్రాంతం.. ఇలా వారణాసి ఎంతో ప్రాశస్త్యం చెందింది. ప్రతి హిందువు జీవితంలో ఒక్క సారైనా దర్శించి తరించాలనుకుంటారు. అటువంటి చోటికి అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మీదుగా లు ఒక్కటీ లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.



కాశీ పట్టణం

- కాశీకి డైరెక్ట్ బండి లేక ఇక్కట్లు
- అంచెలంచెలుగా యాత్ర
- గూడూరు జంక్షనే దిక్కు
- కడప మీదుగా నడపాలని డిమాండ్

రాజంపేట: ఒకప్పుడు కాశీకి పోతున్నారంటే.. ఇక తిరిగి రారేమో అన్న నానుడి ఉండేది. నేటి సామాజిక యుగంలో వాటిని కొట్టిపారేస్తూ.. కాశీకి చేరుకొని తిరిగి క్షేమంగా గమ్యానికి చేరుకునే రవాణా సౌకర్యాలు ఉన్నాయి. అయితే రాయలసీమ జిల్లాల నుంచి వారణాసి(కాశీ) వెళ్లేందుకు రైల్వే వ్యవస్థ ఆవిర్భావం నుంచి ఒక్క రైలు కూడా నడిపించకపోవడం విచారకరమని భక్తులు భావిస్తున్నారు. బీజేపీ పాలనలో కాశీకి రైలు వేయడం మరిచిపోయిందనే విమర్శలు ఉన్నాయి. జిల్లాకు చెందిన ఎంపీ సీఎం రమేష్ రైల్వేస్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆయన అయినా అయోధ్య, వారణాసికి జిల్లా మీదుగా తిరుపతి నుంచి రైలు నడిపించాలని యాత్రికులు, పర్యాటకులు కోరుతున్నారు.

తప్పని వ్యయ ప్రయాస: వారణాసికి వెళ్లేందుకు అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా వాసులు కష్టాలు పడుతున్నారు. ప్రతి హిందువు తన జీవితంలో ఒక్కసారైనా వారణాసికి వెళ్లాలనుకుంటారు. అటువంటి వారి కోసం కనీసం ప్రభుత్వ సాయం లేకపోయినా, రవాణా సౌకర్యం కల్పించకపోవడంపై భక్తులు పెదవి విరిస్తున్నారు. పితృదేవతల అస్థికలు గంగలో నిమజ్జనం చేయడానికి కాశీకి వెళుతుంటారు. వ్యయప్రయాలతో వెళ్లాల్సి వస్తోందని పలువురు చెబుతున్నారు.

తిరుపతి నుంచి రైలు వేస్తే..

పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి అయినా కడప, చిత్తూరు జిల్లాలను కలుపుతూ వారణాసికి డైరెక్ట్ ట్రైన్‌ను పట్టాలెక్కించలేకపోయారు. సీమ నుంచి ఎనిమిది మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు కాశీకి వెళ్లేందుకు డైరెక్ట్ ట్రైన్‌ను తీసుకొచ్చేలా రైల్వే మంత్రిత్వ శాఖపై ఒత్తిడి తీసుకురావాలని భక్తులు విన్నవిస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరామాలయం, దేవుని కడప, అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, నందలూరు సౌమ్యనాథాలయం, పుష్పగిరితోపాటు అతి ప్రాచీనమైన ఆలయాలకు ఉత్తరభారత్ దేశానికి చెందిన వారు రావడానికి ఈ రైలు అనుకూలమని, ఈ విషయాన్ని రైల్వేబోర్డు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

గూడూరు జంక్షనే దిక్కు..

వారణాసి వెళ్లడానికి తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల నుంచి గూడూరు మీదుగా వెళ్లే రైళ్లే అన్నమయ్య, వైఎస్సార్ జిల్లా వాసులకు దిక్కయింది. హైదరాబాద్ నుంచి కూడా వెళ్లే పరిస్థితులు నేడు ఉన్నాయి. మైసూరు నుంచి వారణాసికి ఒకే ఒక్క రైలు అనంతపురం జిల్లాలోని గుంతకల్ మీదుగా వెళుతుంది. అది నిండుగా ఉంటోంది. జనరల్, రిజ్వరేషన్ బోగీలు కిటకిటలాడుతుంటాయి. కడప, చిత్తూరు, కర్నూలు జిల్లా వాసులు అంచెలంచెలుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వారణాసికి ఎలా వెళ్లాలో అంతుపట్టడం లేదని భక్తులు వాపోతున్నారు. కాశీ ప్రయాణం సులభతరం చేసేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అయోధ్యకు..

జిల్లా మీదుగా అయోధ్య, వారణాసికి రైలు నడిపితే తిరుపతి నుంచి రాజంపేట, నందలూరు, కడప, ఎర్రగుంట్ల, గుత్తి , డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కాజీపేట, పెద్దపల్లి, బల్లర్షా, గోండియా, బాలాఘాట్, సైన్‌పూర్, జబల్‌పూర్, కట్నీ, సత్నా, మాణిక్‌పూర్, ప్రయోగరాజ్, వారణాసి మీదుగా అయోధ్య వరకు రైలు నడిపితే ఇటు తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనంతోపాటు కాశీలోని జ్యోతిర్లింగం, ప్రయోగరాజ్‌లోని శక్తిపీఠం, అయోధ్య బాలరాము వారి దర్శనం చేసుకునేందుకు వీలవుతుంది.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి



జిల్లాలో ఎంతో మంది హిందువులు వారణాసికి వెళ్లడానికి కష్టాలు పడుతున్నారు. జిల్లా మీదుగా వారణాసి, అయోధ్యకు రైలు నడపాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలి. తిరుపతి–వారణాసి మధ్య రైలును నడిపితే ఉపయోగకరంగా ఉంటుంది.

– డాక్టర్ ఆవుల శంకర్, కంటి వైద్య నిపుణులు, రాజంపేట

ఉత్తర భారతీయులకూ సదుపాయం



వారణాసి, అయోధ్య వంటి క్షేత్రాలకు కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా డైరెక్ట్ ట్రైన్ వేయాలి.. దీనివల్ల ఉత్తర భారతీయులు తిరుపతికి రావడానికి అనువుగా ఉంటుంది. –జీవీ రమణ, ఎస్టీయూ మాజీ నేత, గొల్లపల్లె, నందలూరు

న్యూస్‌రీల్

అంగళ్లు విద్యార్థికి నాసా అవార్డు



అవార్డు అందుకున్న విద్యార్థిని శెట్టి జిష్ణవి

కురబలకోట: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రతిష్టాత్మక అవార్డు మండలంలోని అంగళ్లుకు చెందిన శెట్టి సీతారాం కుమార్తె శెట్టి జిష్ణవికి మంగళవారం లభించింది. ఈమె మదనపల్లె పట్టణంలోని చైతన్య స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. గత ఏడాది యువ అంతరిక్ష శాస్త్రవేత్తల పోటీ–25 టీమ్‌లో పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈమె టీమ్ రూపొందించిన బ్రహ్మాస్త్ర 3.0 అనే ప్రాజెక్టు నాసా నిర్వహించిన అంతర్జాతీయ శాస్త్రీయ పోటీలో మొదటి బహుమతి అందుకున్నట్లు నాసా వెల్లడించింది. ఈమెకు షీల్డ్‌ను, మెడల్‌ను అందజేశారు. తమ కుమార్తె శెట్టి జిష్ణవికి నాసా గుర్తింపు రావడం గర్వకారణంగా ఉందని అన్నమయ్య జిల్లా కాపు సంఘం అధ్యక్షులు శెట్టి సీతారాం సంతోషం వ్యక్తం చేశారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: మదనపల్లి మండలం వలసపల్లిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశాలకు ప్రస్తుతం 8వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 2011 మే 1 నుంచి 2013 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 2009 జూన్ 1 నుంచి 2011 జూలై 31 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 23వ తేదీలోపు చేసుకోవాలని ఆమె వివరించారు.

6వ తరగతిలో..

రాజంపేట: మండల పరిధి నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–2026 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల గడువును ఆగస్టు 13 తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ గంగాధరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపుకోవాలని తెలిపారు. మరిన్న వివరాల కోసం నవోదయ విద్యాలయం వెబ్‌సైట్స్‌ను సందర్శించాలని వివరించారు.

సరోగసి కేంద్రాల తనిఖీ

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఆర్‌టీ/సరోగసి యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్న కేంద్రాలను తనిఖీ చేశారు. కడప నగరంలో లెవెల్–2 మూడు, లెవెల్–1 రెండు, జమ్మలమడుగు డివిజన్‌లో లెవెల్–2 రెండు, లెవెల్–1 ఒకటి , ఒక ఏఆర్‌టీ బ్యాంకులను ఏఆర్‌టీ టీం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ నాగరాజు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భవ్య, డిప్యూటీ డెమో రమణమ్మ, కుమారి, పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

మదనపల్లె సిటీ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో జరుగుతున్న పది రోజుల కేజీబీవీ టీచర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీచర్లు సామాజిక బాధ్యత వహించి విద్యార్థులలో సామాజిక స్పృహ కలిగించాలని కోరారు. కేజీబీవీ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న పేద బాలికలను దత్తత తీసుకుని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు, సమగ్ర శిక్ష సీఎంఓ కరుణాకర్, పూర్వ సెక్టోరియల్ అధికారి పి.మహమ్మద్‌ఖాన్, వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, అడ్మిన్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో యామవరం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని శివప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యామవరం గ్రామానికి చెందిన శివప్రసాద్ రహదారి పక్కన నడుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను రహదారి పక్కనే వున్న లోతట్టు ప్రాంతంలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో క్షతగాత్రుని కాలు విరిగినట్లు, మరో కాలికి తీవ్ర గాయమైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించారు.

13 మంది జూదరుల అరెస్టు

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె ఎగువచెరువు వద్ద జూదమాడుతున్న 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. వద్ద నుండి రూ.2,59,500 నగదు, 16 సెల్‌ఫోన్లు, 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వివాదంలో పరస్పర దాడులు

మదనపల్లె రూరల్ : మండలంలోని కొత్తవారిపల్లె గ్రామానికి చెందిన మహేష్, నాగరాజు భూవివాదంలో ఘర్షణ పడి మంగళవారం ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. దీనిపై మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రేఖ

ములకలచెరువు : కుటుంబ కలహాలతో ఒక యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పర్తికోటకు చెందిన శ్రీనివాసులు భార్య రేఖ(31) కుటుంబ కలహాలతో విషం తాగి ఇంటిలో అపస్మారక స్థితిలో పడివుంది. కుటుంబ సభ్యులు గమనించి 108 సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌ఓ గదిలో చోరీ యత్నం


చోరీ యత్నం దృశ్యాలను చూపుతున్న వీఆర్‌ఓ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : రాయచోటి మండల పరిధిలోని గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ కార్యాలయ గదిలో సోమవారం రాత్రి దొంగలు చోరీ యత్నం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గది తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. బీరువా తాళాలతో పాటు టేబుల్ ర్యాక్ కూడా పగుల గొట్టారు. అందులో ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. అయితే రికార్డులు మాత్రం చిందరవందరగా పడేశారు.

సోమశిలలో.. అక్రమ వేట!

- ఆగస్టు 31 వరకు చేపల వేటపై నిషేధం
- ముంపు గ్రామాల నుంచి అక్రమ రవాణా
- నిద్రావస్థలో మత్స్యశాఖ అధికార గణం


సోమశిల బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు ఉపయోగించే నాటు పడవలు


వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలో కొనసాగుతున్న చేపల విక్రయాలు

రాజంపేట : సోమశిల జలాశయం (నెల్లూరు జిల్లా సోమశిల)కు సంబంధించి బ్యాక్‌వాటర్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని అట్లూరు, గోపవరం, నందలూరు, ఒంటిమిట్ట మండలాల్లో విస్తరించి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాక్ వాటర్‌లో గుడ్డు దశలో ఉన్న చేపల సంపదపై అక్రమవేట కొనసాగుతోంది. చేపల వృద్ధి అడ్డుగా అక్రమవేట కొనసాగుతోంది. పరోక్షంగా చేపల సంపదకు గండి కొడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంతానోత్పత్తికి విఘాతం కలిగిస్తున్నారు.

ఇలా అక్రమ రవాణా..

ప్రధానంగా సోమశిల బ్యాక్ వాటర్‌లో చేప పిల్లలకు ప్రాణ సంకటంగా పరిణమించే అలివి వలను అక్రమార్కులు వినియోగిస్తున్నారు. ఒంటిమిట్ట మండలంలో పల్లాగట్ట నుంచి చేపలను అక్రమంగా వేటాడి నందలూరు మండలంలోని కోనాపురానికి చేర్చి, అక్కడి నుంచి చేపల మార్కెట్‌కు చేరుస్తున్నారు. పాత మాధవరం, బోయనపల్లె, చిన్నపురెడ్డిపల్లె, కొండమాచుపల్లె, గుండ్లమాడ, దొంగలసాని గ్రామాలతో పాటు నందలూరు, గోపవరం మండలాల్లో దర్జాగా చేపల అక్రమ వేట జరుగుతోంది.

ఆగస్టు 31 వరకు వేటపై నిషేధం

జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు సోమశిల బ్యాక్ వాటర్‌లో చేపల వేట నిషేధమని ప్రభుత్వం ప్రకటించిన సంగ

తి తెలిసిందే. అయినా నాటు పడవల ద్వారా బ్యాక్‌వాటర్‌లోకి అక్రమంగా ప్రవేశించి చేప పిల్లలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారం మత్స్యశాఖకు తెలియకుండా ఉండదని ముంపుబాధితులు పేర్కొంటున్నారు. బ్యాక్ వాటర్‌లో వేట నిషేధం అమలు కావడం లేదని వారంటున్నారు.

యథేచ్ఛగా చేపల అక్రమ వేట..

సోమశిల బ్యాక్‌వాటర్ సమీప ముంపు గ్రామమైన నందలూరు మండలంలోని కోనాపురం ప్రాంతంలో చేపల అక్రమ వేట కొనసాగుతోంది. నిషేధం ఆంక్షలను సైతం పట్టించుకోకుండా చేపలు పట్టేవారు బ్యాక్ వాటర్‌లోకి నాటుపడవలు వేసుకొని వెళతున్నారు. దాదాపు 200 నుంచి 300 మంది వరకు మత్స్యకారులు వేటను కొనసాగించే క్రమంలో బ్యాక్‌వాటర్ వెంబడి తాత్కాలిక నివాసాలు వేసుకొని జీవిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, వైజాగ్, నెల్లూరు, ప్రకాశంతోపాటు మరికొన్ని జిల్లాల నుంచి మత్స్యకారులను రప్పించి, వారిచేత వేట చేయిస్తున్నారు. ప్రతి రోజు 10 నుంచి 15 టన్నుల చేపలు పట్టి తిరుపతి, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, కోలకత్తా చేపల మార్కెట్‌కు తరలిస్తున్నారు.

మత్స్యశాఖ అధికారులకు తెలియకుండానే..

చెన్నూరు, మాధవరం, కొడమలూరు తదితర ప్రాంతాలకు చెందిన కొందరు చేపల వ్యాపారంలో ఆరితేరి వున్నారు. వీరి కనుసన్నల్లో చేపల అక్రమవేట కొనసాగుతోంది. ఈ విషయం మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి తెలిసిన బహిరంగ రహస్యమే. వారికి మామూళ్లు అందుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. దీంతో సోమశిల బ్యాక్‌వాటర్‌లో జరిగే చేపల అక్రమ వేటను చూసీ చూడనట్లు, తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ముంపు వర్గాల వారు బహిరంగంగానే పేర్కొంటున్నారు. బాక్స్ రూ.7వేల నుంచి రూ.8వేల వరకు విక్రయిస్తున్నారు. వివిధ రకాల చేపలను పట్టుకొని బ్యాక్‌వాటర్ ఒడ్డుకు తీసుకొచ్చి కేజీ రూ.120 నుంచి రూ.140 వరకు అమ్మకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం మత్స్యశాఖ అధికారులు, సిబ్బందికి తెలియకుండానే జరుగుతుందనేది వాస్తవం కాదు.

మత్స్యశాఖ అధికారి ఏమంటున్నారంటే..

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేపల అక్రమ వేటపై రాజంపేట మత్స్యశాఖ అధికారి మురళీని వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానన్నారు. బ్యాక్‌వాటర్‌లో చేపల వేట నిషేధం కొనసాగుతోంది. అయినా అక్రమంగా చేపలవేట కొనసాగుతుందన్న విషయం తనకు తెలియదన్నారు. ఈ విషయంపై తాను విచారణ చేసి, చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాగా, ఒంటిమిట్ట మండలం (వైఎస్సార్ జిల్లా) పరిధిలోని బ్యాక్‌వాటర్ విస్తరించిన ప్రాంతంలో స్థానికంగా ఉన్న వారిని ఖాళీచేసి వెళ్లిపోవాలని, చేపల వేట నిషేధం ఉందని హెచ్చరించామని మత్స్యశాఖ ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. కోనాపురం వైపు చేపల వేట జరుగుతోందన్న సమాచారం రాజంపేటకు చెందిన అధికారి మురళికి తెలియజేశామని వెల్లడించారు.

బ్యాక్‌వాటర్ పెరగుతోందని..

రెండు, మూడు రోజుల్లో బ్యాక్‌వాటర్ పెరుగుతోందన్న సమాచారంతో బ్యాక్‌వాటర్‌లో చేపల అక్రమ వేటను వేగవంతం చేసుకుంటున్నారు. ముంపు గ్రామాల్లో చేపల రవాణా సందడి నెలకొంది. వాహనాలలో ఐస్ బాక్స్‌లో చేపలను రవాణా చేస్తున్నారు. బ్యాక్‌వాటర్‌లో దొరికినకాడికి చేపలను వల వేసి పట్టుకొని దొడ్డిదారిలో చేపల మార్కెట్‌కు తరలిస్తున్నారు. బ్యాక్ వాటర్ పెరిగితే అక్రమ వేటకు అడ్డుగా మారుతుందనే భావనలో వేట నిర్వాహకులు ఉన్నారు.

వెలిగల్లులోనూ..

గాలివీడు : వెలిగల్లు జలాశయంలో రెండు మాసాల పాటు చేపల వేటపై నిషేధం ఉన్నా విచ్చల విడిగా చేపల వేట కొనసాగుతోంది. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి మత్స్యకారులను ప్రలోభపెట్టి చేపలు పట్టిస్తున్నారు. అడ్డుకోవాల్సిన నిఘా యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకుని చోద్యం చూస్తోంది. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా వలలు వేసి తెల్లవారుజామున సరుకు మొత్తం గాలివీడు, రాయచోటి, మదనపల్లె, కడప ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనధికారికంగా వేట సాగిస్తుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గాలివీడు విలేజ్ ఫిషర్స్ అసిస్టెంట్ రామాంజి నాయక్ తెలిపారు.

వైభవంగా ఈశ్వరీదేవి జయంత్యుత్సవం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న మఠాధిపతి దంపతులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం మండలంలోని ఈశ్వరీదేవి మఠంలో ఈశ్వరీదేవి జయంత్యుత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఈశ్వరీ మాత సేవా సమితి ట్రస్ట్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. ఇందులో మఠాధిపతి వీరశివకుమారస్వామి, రాజరాజేశ్వరిదేవి దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఊరేగింపు

అష్టోత్తర(108) కలశాలతో భక్తజనం ఊరేగింపు ఆకట్టుకుంది. తర్వాత గుడి ఉత్సవం కమనీయంగా జరిగింది. మధ్యాహ్నం నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. మఠాధిపతి వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయశాఖ అధికారులు, అమ్మవారి శిష్య బృందం ఏర్పాట్లు చేశారు.

ఎంపీ మిథున్ రెడ్డి విడుదల కావాలని ప్రార్థనలు


ఓబులవారిపల్లె : ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని టెంకాయలు కొడుతున్న దృశ్యం


గుర్రంకొండ : మర్రిపాడులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లీమ్ మహిళలు

ఓబులవారిపల్లె/గుర్రంకొండ : అక్రమంగా అరెస్టయి జైలులో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విడుదల కావాలని కోరుతూ మంగళవారం ఓబులవారిపల్లి మండలం, మంగంపేట నీరుంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిథున్ రెడ్డి ఆరోగ్యం బాగుండాలని ప్రార్థన నిర్వహించామన్నారు. మంగంపేట గ్రామస్తులు వెంకటరెడ్డి, రవి శంకర్‌రెడ్డి, గల్లా శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఆజాం, ఇర్ఫాన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ మహిళలు..

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి క్షేమంగా ఉండాలని కోరుకుంటూ మండలంలోని మర్రిపాడు గ్రామానికి చెందిన ముస్లీమ్ మైనార్టీ మహిళలు మంగళవారం స్థానిక హాసార్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షెహనాజ్‌బేగం, బషీరున్నీసా, మహబూబ్‌జాన్, జెహదున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు లేకుండానే భూకేటాయింపులా.?

అడ్డగోలు భూకేటాయింపులపై నిసార్‌అహ్మద్ ఆగ్రహం



మదనపల్లె రూరల్ : అత్యంత విలువైన భూములను టెండర్లు లేకుండా, నిబంధనలు పాటించకుండా పప్పుబెల్లాలు మాదిరిగా కూటమి ప్రభుత్వం కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు సంతర్పణ చేయడమేంటని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్, కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొన్నాళ్లుగా కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా చేస్తున్న భూ పందేరాలపై, ఆయా సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వ పెద్దలు చేసుకున్న లోపాయికారి ఒప్పందాలను ప్రజల ముందు బహిర్గతం చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థలు, సూపర్ మార్కెట్ సంస్థకు విలువైన ప్రభుత్వ స్థలాలు కట్టబెట్టాల్సిన అవసరం ఏముందన్నారు. వైజాగ్, విజయవాడలో దుబాయ్ సంస్థ లులూ గ్రూప్ ఏర్పాటు చేస్తున్న భారీ మాల్‌కు తక్కువ ధరలకు భూములు కేటాయించడంపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవైపు కక్షసాధింపులు, మరోవైపు ప్రభుత్వ భూములు బినామీలకు కారుచౌకగా అప్పగించి తద్వారా జేబులు నింపుకునేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విజయవాడలో పాతబస్టాండుగా పిలుచుకునే గవర్నర్‌పేట ఆర్టీసీ డిపోకు చెందిన రూ.600 కోట్ల విలువైన 4.15 ఎకరాల భూమిని, రూ.156 కోట్ల పెట్టుబడి కోసం 99 సంవత్సరాల కాలపరిమితికి లీజు విధానంలో అప్పగించడం హాస్యాస్పదమన్నారు. కేరళ, హైదరాబాద్‌లో మాల్స్ నిర్మించిన లులుకు ఎక్కడా ప్రభుత్వ భూములు కేటాయించలేదన్నారు. అలాంటి లులుకు చంద్రబాబు ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నంలో అత్యంత ఖరీదైన భూములను కారుచౌకగా అప్పగించడం వెనుక ఏ ప్రయోజనాలున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు

కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్


సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

సిద్దవటం : ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడానికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని అటవీ శాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ఎర్రచందనం, వన్యప్రాణులకు సంబంధించి గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది తరచూ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కమలాపురం పట్టణంలో యాచకవృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న వృద్ధుడు రాత్రి రోడ్డు దాటుతుండగా కడప నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడికి రెండు కాళ్లు, రెండు చేతులు విరిగిపోయాయి.

మత్తుతో జీవితం ఛిన్నాభిన్నం

అడిషనల్ ఎస్పీ ఎం.వెంకటాద్రి


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ఎం. వెంకటాద్రి

రాయచోటి టౌన్ : మత్తుకు అలవాటు పడితే జీవితం ఛిన్నాభిన్నం అవుతుందని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి శ్రీ సాయి శుభ కల్యాణ మండపంలో మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్ప్రభావాలపై టీనేజ్ యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలను ముందు సరదా కోసం ఉపయోగిస్తారని తరువాత వాటికి బానిసగా మారిపోయి జీవితాలనే నాశనం చేసుకుంటారని తెలిపారు. అలాంటి అలవాట్ల జోలికి వెళ్లకుండా మీ బంగారు భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకోవాలని సూచించారు. అలాగే పిల్లల అలవాట్లపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐలు లోకేష్, వెంకటేష్, గాయత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యం.ప్రకాష్, ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అరమాటి శివగంగిరెడ్డి, రాజు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుడు వై. గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

VOCATIONAL COURSES

■ LM&D (డ్రైవింగ్ & పశువిద్య), MLT, MPHW(F), C&T కోర్సులకు 2025 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత : 10th ఆపైన, హాస్టల్ కలదు. సెల్: 99855 66783.

SERIVCES

మ్యారేజ్ బ్యూరో

■ శ్రీ మహాలక్ష్మి మ్యారేజ్ లింక్స్ D/-7/562-A4 NGO కాలనీ కడప వివాహ సంబంధంలకు, ఎంపిక మీది కుదిరించే బాధ్యత మాది 25 years అనుభవం గల, సంస్థ, సంప్ర:- 7899499023/6305581489

WANTED

■ కెపిటల్ చిట్స్ రాజంపేట, పీలేరు బ్రాంచి యందు బిజినెస్ ఎగ్జిక్యూటివ్ / కలెక్షన్ ఇన్చార్జి గా పని చేయుటకు 10th, ఆపైన చదివిన, వయస్సు 19-30 సంవత్సరాలు కలిగిన అభ్యర్థులు కావలెను. జీతం : 18,000/-,నం'రానికి 8,000/- ఇంక్రిమెంట్ + ఇన్సెంటివ్ + బోనస్ Ph :(రాజంపేట) : 808891 2207 (పీలేరు) : 9505507125, 9848312025

■ కస్తూరిక్లీన్స్ కావు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

■ యర్రగుంట్ల సిమెంట్ ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ, జీ: 14 వేలు Ph: 8185090991, 9052124024, 8341389975

■ Wanted Typist English & Telugu Typist Respectable Salary Location Proddatur Cell: 9966986952, 9390852381;

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

నామినేషన్లకు ముందే బెదిరింపులు


మీసం మెలేస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి


కొండమాచుపల్లిలో ఎగురుతున్న టీడీపీ జెండా

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున నామినేషన్ వేసిన వారిని తుదముట్టిస్తామంటూ మంగళవారం స్థానిక హరితా హోటల్‌లో విలేకరుల సమావేశంలో రాజంపేట టీడీపీ నాయకుడు మేడా విజయ శేఖర్ రెడ్డి బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. ఇంకా నామినేషన్లు వేయక ముందే అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు. తమకు ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేసేందుకు గానీ, పోటీ చేసేందుకు గానీ భయపడే విధంగా టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతుండటం రౌడీ రాజకీయాన్ని తలపిస్తోందని పలువురు పేర్కొంటున్నారు. దమ్ముంటే పోటీ చేయండి అంటూ మీసాలు మెలివేయడం, తుదముట్టిస్తామని బెదిరించడం లాంటి టీడీపీ నేతల వైఖరి చూస్తుంటే ఒంటిమిట్ట ఉప ఎన్నిక సజావుగా జరిగేనా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన..

మండల పరిధిలోని కొండమాచుపల్లి గ్రామంలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా తెలుగుదేశం జెండా ఎగురుతోంది. ఇది చూసిన కొంత మంది ఇతర రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మండల ప్రజలు అధికార పార్టీ జెండా అని అధికారులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని సంబంధిత ఎన్నికల అధికారిని ప్రజలు కోరుతున్నారు.

ఆగస్టు 2న ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా

రాయచోటి : ప్రభుత్వ బడులలో పనిచేసే ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీ జనరల్ జాబిర్, గఫార్ ఖాన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఫ్యాప్టో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని అనేకసార్లు ఉద్యమాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీంతో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆగస్టు 2న అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా కోచైర్మన్‌లు శివారెడ్డి, సిబాతు రెహ్మాన్, రామకృష్ణ, జిల్లా కోశాధికారి జపరుద్దీన్, ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యుడు రవీంద్రారెడ్డి, నాయకులు గోపీకృష్ణ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసులో మూడు నెలల జైలు


పత్తి సుధాకర్

రాయచోటి టౌన్ : లక్కిరెడ్డిపల్లె మండలంలో ఒక మహిళపై అత్యాచారానికి యత్నించిన కేసులో పత్తి సుధాకర్ అనే వ్యక్తికి రాయచోటి ఏజేఏస్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఇ.ప్రసూన మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధించినట్లు లక్కిరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. 2011 సంవత్సరం నవంబర్ 12న 12.11.2011వ సంవత్సరంలో లక్కిరెడ్డిపల్లె మండలంలో ఒక మహిళపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించినట్లు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఈమేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్ష విధిస్తారనేందుకు ఈ కేసు ఒక నిదర్శనమన్నారు.

రైలు నుంచి పడి విద్యార్థికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన విద్యార్థి

కురబలకోట : నడుస్తున్న రైలు నుంచి కింద పడి విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం సాయంత్రం కురబలకోట రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. కదిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ బాషా కథనం మేరకు..సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన సఫాన్ (18) తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్ద రెండు రోజుల పాటు వుండి మంగళవారం తిరిగి తిరుపతి కళాశాలకు కదిరి నుంచి రైలులో బయలుదేరాడు. మార్గమధ్యంలోని కురబలకోట రైల్వే స్టేషన్ పరిధిలోని సింగన్నగారిపల్లె సమీపంలో డోర్ పక్కనుంచి ప్రమాదవశాత్తు పట్టు జారి కిందపడి గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

• నోరూరిస్తున్న ఖర్జూరం!



పుల్లంపేట : పుల్లంపేట మండలం సాదువారిపల్లి గ్రామంలో ఖర్జూరం విరగ గాసింది. దినేష్ కుమార్ అనే రైతు ఖర్జూరపు పంట సాగు చేశాడు. ఒక్కో చెట్టుకు రూ.4 వేలు వెచ్చించి ఎకరాకు 80 చెట్లు సాగు చేశాడు. మూడేళ్ల నుంచి ఖర్జూరం దిగుబడి రావడంతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నాడు. ప్రస్తుతం కిలో రూ.200 చొప్పున ఖర్జూరాన్ని విక్రయిస్తున్నట్లు తెలిపాడు.